క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన సంపంగి లక్ష్మణ్ ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. దీంతో ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని ముత్యాల సునీల్ రెడ్డి ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూత అందించారు. గురువారం లక్ష్మణ్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గణేశ్ గుప్తా, సింగిరెడ్డి శేఖర్, పన్నాల రాకేష్ తదితరులు సునీల్‌రెడ్డి వెంట ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ స్థల పరిశీలన



రుద్రూర్: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని గురువారం తహసీల్దార్ ముజీబ్, రుద్రూర్ సీఐ జాన్‌రెడ్డి పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ కోసం గతంలో 35 గుంటల స్థలాన్ని కేటాయించారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు నిర్మాణాలు కొనసాగుతున్నందున సర్వే చేసి సరిహద్దులు నిర్ధారించారు. హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఎస్‌హెచ్‌వో రవీందర్, ఆర్‌ఐ మల్లికార్జున్, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, తదితరులు ఉన్నారు.

నవోదయ పాఠశాలకు ఎంపిక

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని విజ్ఞానజ్యోతి హైస్కూలుకు చెందిన సింగారి ప్రజ్వల్, బక్కూరి హేమంత్, మిసిమి హైస్కూలుకు చెందిన కాండ్లి వైష్ణవ్ జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్లు గుండోజి దేవేందర్, పాలి రవీందర్ గురువారం తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయబృందం అభినందించి సత్కరించారు. హెచ్‌ఎం సౌమ్య పాల్గొన్నారు.

లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ నుంచి..

నవీపేట: జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు గురువారం తెలిపారు. 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ధీరజ్, యజ్ఞకృత్‌లు నవోదయకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

వేల్పూర్: వేల్పూర్‌కు చెందిన సేన గణేష్ ఇటీవల పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనిపెట్టి ఆయనకు గురువారం ఎస్సై వినయ్‌కుమార్ అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్‌ను ఎక్కడైనా పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

నియామకం

వర్ని: జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ ఆన్లైన్ క్విజ్ కాంపిటీషన్ కో–ఆర్డినేటర్‌గా వర్ని మండలానికి చెందిన పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజిరెడ్డిని నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నుంచి గురువారం రాజిరెడ్డికి అందాయి. తనపై నమ్మకంతో కో–ఆర్డినేటర్‌గా నియమించినందుకు తన వంతు కృషి చేస్తానని రాజిరెడ్డి వెల్లడించారు.

బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్‌గా బెంజర్ గంగారాం

బోధన్‌టౌన్(బోధన్): బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా 18వ వార్డు కౌన్సిలర్ బెంజర్ గంగారాం నియమితులయ్యారు. బెంజర్ గంగారాంను మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా గురువారం పార్టీ పట్టణ అధ్యక్షులు ప్రకటించారు. తనపై నమ్మకంతో మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా నియమించిన ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్‌కు, సహకరించిన పార్టీ పట్టణ అధ్యక్షులకు, ఏఎంసీ చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పంపా సాహితీ పీఠం అధ్యక్షుడు అజయ్‌కుమార్‌కు సన్మానం



బోధన్: భారత జాగృతి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ సాహిత్య సభల్లో బోధన్‌కు చెందిన పంపా సాహితీ పీఠం అధ్యక్షుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పురాణీ అజయ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాలువా, జ్ఞాపికను అందించారు. సాహిత్య సభల్లో రాష్ట్రంలోని కవులు, సాహితీ సంస్థల ప్రతినిధులను సన్మానించగా, ఇందులో అజయ్ కుమార్‌కు చోటు దక్కింది.

ముప్కాల్ ఏఎస్సైకి..

బాల్కొండ: భారత జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ముప్కాల్ ఏఎస్సై సురేశ్‌ను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం సన్మానించారు. ఓ పోలీసు అధికారి కవిగా, రచయితగా రాణించడం అభినందనీయమన్నారు. మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



చౌటపల్లిలో.. ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి



ఆర్మూర్ పట్టణంలో..



కల్లూర్కిలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నేత మేడపాటి ప్రకాశ్ రెడ్డి

కేంద్ర ప్రభుత్వ పథకాలపై గురువారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవినీతికి తావు లేకుండా పారదర్శక పాలన సాగిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సమర్థవంతమైన పాలనలో పథకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ బీజేపీకి మద్దతుగా నిలిచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపర్చాలన్నారు. రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చేందుకు కృషి చేయాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



మోకన్‌పల్లిలో.. వడ్డీ మోహన్‌రెడ్డి



అంకాపూర్‌లో.. పైడి రాకేశ్ రెడ్డి



రెంజల్‌లో.. బీజేపీ నాయకులు



వేల్పూర్ మండల కేంద్రంలో ..

అమరవీరులకు ఘనంగా నివాళులు



బోధన్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులు



బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో..

సాక్షి నెట్‌వర్క్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల సంస్మరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పలుచోట్ల అమరవీరుల స్తూపాల వద్ద, స్తూపం చిత్రపటాల వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. అమరువీరుల సంతాప తీర్మానాన్ని చదివి వినిపించారు. వారు రాష్ట్ర ఏర్పాటుకు చేసిన ప్రాణ త్యాగాన్ని స్మరించుకున్నారు.



వర్ని: పోలీస్ కిష్టయ్య విగ్రహం వద్ద ..



మెండోరా మండలం పోచంపాడ్‌లో..



వేల్పూర్ మండలం జాన్కంపేట్‌లో..



నందిపేట ఎంపీడీవో కార్యాలయంలో ..



మాక్లూర్‌లో తెలంగాణ రాష్ట్ర పటంగా కూర్చున్న విద్యార్థులు



ఎడపల్లి గ్రామ పంచాయతీలో ప్రతిజ్ఞ..

అమలు కాని హామీలిచ్చి మోసం చేశారు



బోధన్ పట్టణంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



బాల్కొండలో ..

సాక్షి నెట్‌వర్క్ : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను పదేళ్లయినా సీఎం కేసీఆర్ నెరవేర్చలేదని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవరణ అనంతరం అమలు కాని హామీలను ఇచ్చి ప్రజలను కేసీఆర్ మోసం చేస్తున్నారని ఆరోపించారు. మిగులు బడ్జెట్ గల రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, ప్రజాధనంతో ఆవిర్భావ పండుగలు చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాలు, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కేజీ టూ పీజీ ఉచిత విద్య, పోడు భూములకు పట్టాలు, ఇంటికొక ఉద్యోగం, ముస్లిం, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ ఈ హామీలన్నీ ఎటు పోయాయని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌కు పోయే కాలం దాపురించిందని విమర్శించారు.



ముప్కాల్ మండలం రెంజర్లలో ..



ఆర్మూర్‌టౌన్: అంబేడ్కర్ చౌరస్తా వద్ద..

ఏఐటీఐ మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

బోధన్: ఆలిండియా తంజీవ్ ఈ ఇన్సాఫ్ (ఏఐటీఐ) తెలంగాణ రాష్ట్ర మూడో మహాసభలు ఈ నెల 24, 25 తేదీల్లో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ కేంద్రంలో జరుగనున్నాయి. మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం పట్టణ కేంద్రంలో ఇన్సాఫ్ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లీం మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, సచార్ కమిషన్ నివేదిక అంశాలపై మహాసభల్లో చర్చ ఉంటుందని పేర్కొన్నారు. ఇన్సాఫ్ జాతీయ కార్యదర్శి ఏఏ ఖాన్, మాజీ ఎంపీ అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావులు హాజరుకానున్నారని తెలిపారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐటీఐ నేతలు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

బోధన్‌లో పదమూడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మూడో వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి రాధాక్రిష్ణ తమ్ముడు కొత్తపల్లి రవీందర్‌ను కఠినంగా శిక్షించాలని ఏఐటీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్‌బాబు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబీకులను బెదిరించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రాధాక్రిష్ణను కౌన్సిలర్ పదవి నుంచి వెంటనే తొలగించాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. ఇన్సాఫ్ పట్టణ ప్రతినిధులు గౌస్, సలీం, రసూల్, రహీం పాల్గొన్నారు.

నిందితుడికి ఉరిశిక్ష విధించాలి

రెంజల్(బోధన్): బోధన్‌లోని శక్కర్‌నగర్‌లో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని జమాతుల్ ఉలేమా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రెంజల్ స్టేషన్‌లో గురువారం ఎస్సై సాయన్నకు ఫిర్యాదు చేశారు. నిందితులకు శిక్ష పడే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.



రెంజల్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

రుద్రూర్‌లో..

రుద్రూర్: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడారు. ఘటనను తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు లాల్ మొహమ్మద్, జిల్లా అధ్యక్షులు సయ్యద్ ముల్తానీ, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదను అరికట్టండి

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని బీజేపీ ఫ్లోర్ లీడర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో చిన్నపిల్లలు, వృద్ధులు కుక్కల కాటుకు గురవుతున్నారని అన్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొంతం మురళీ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నేత జీవీ నర్సింహారెడ్డి

అమరుల కుటుంబాలకు ప్రభుత్వ అండ



వేల్పూర్: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీపీ బీమ జమున అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ అమరవీరుల త్యాగంతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందన్నారు. అమరవీరులకు నాయకులు నివాళులర్పించారు. అనంతరం వివిధ శాఖలపై మండల సభలో సమీక్ష జరిపారు. సమావేశంలో ఎంపీడీవో కమలాకర్, ఆత్మ కమిటీ చైర్మన్ నోముల రవీందర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నారు



ఆర్మూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలను భర్తీ చేయకుండా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి సూర్య శివాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్ కాలనీలో పీవైఎల్ ఆర్మూర్ ఏరియా ఎనిమిదవ మహాసభను గురువారం నిర్వహించారు. పీవైఎల్ నాయకుడు వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ దేశాన్ని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారన్నారు. 25న జిల్లా కేంద్రంలో నిర్వహించే పీవైఎల్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు రవి పాల్గొన్నారు.

వ్యక్తిగత కక్షతో ఇబ్బందులకు గురి చేస్తున్నారు

పెర్కిట్(ఆర్మూర్): కొందరు విద్యార్థి సంఘాల నాయకులు వ్యక్తిగత కక్షలతో ప్రైవేటు పాఠశాలలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు లక్కారం ప్రసాద్ ఆరోపించారు. పట్టణ శివారులో ఉన్న పాఠశాలలో రవాణ సౌకర్యంతో ఇబ్బందులు పడుతున్న తల్లితండ్రుల సమ్మతంతోనే పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. విద్యార్థి నాయకులు అనుమతి లేకుండా పాఠశాలలోకి దౌర్జన్యంగా ప్రవేశించి వీడియోలు తీసి ఇబ్బంది పెడుతున్నారన్నారు. సమస్యలపై పోరాడాల్సిన నేతలు తమ పబ్బం గడుపుకోవడానికే పాఠశాలల యాజమాన్యాలను ఒత్తిళ్లకు గురి చేస్తున్నారన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



ఆర్మూర్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్ అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా ఎక్సైజ్ అధికారులు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం 11 మంది విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్‌లు అందజేశారు. అధికారులు మల్లారెడ్డి, స్టీఫెన్‌సన్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కమ్మర్‌పల్లి: సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డీవీ కృష్ణ మొదటి వర్ధంతికి నాయకులందరూ తరలి రావాలని పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి అశోక్ కోరారు. గురువారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అఖిలభారత రైతు సంఘం అధ్యక్షుడు సారా సురేష్, నాయకులు బాలయ్య పాల్గొన్నారు.

బలిదానాలన్నీ కాంగ్రెస్ హత్యలే

● ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్: స్వరాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలి విడత ఉద్యమాలలో చోటు చేసుకున్న బలిదానాలన్నీ కాంగ్రెస్ పార్టీ చేసిన హత్యలేనని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమర వీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలను తెలంగాణ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అడ్డు పడుతున్న బీజేపీ, కాంగ్రెస్‌లు తెలంగాణ రాష్ట్రానికి శత్రువులన్నారు. అమరుల త్యాగాలను రాజకీయం చేస్తున్న వారి తీరే అందుకు నిదర్శనమన్నారు.

ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలి



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీకి చెందిన 13 ఏళ్ల బాలికను అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం ఫాస్ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేత కొత్తపల్లి రవీందర్, బాలిక కాళ్లు, చేతులు కట్టేసి అత్యాచారానికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. నిందితుడికి అండగా నిలిచి బాధిత కుటుంబాన్ని బెదిరించిన అన్న రాధాకృష్ణను బీఆర్‌ఎస్ పార్టీ నుంచి తొలగించి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి ఎమ్మెల్యే సస్పెండ్ చేశారని వెల్లడించారు. బీఆర్‌ఎస్ పార్టీ బాధితురాలిని దత్తత తీసుకొని అండగా నిలబడుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా బెంజర్ గంగారాంను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కౌన్సిలర్లు ధూప్‌సింగ్, అబ్దుల్లా, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షులు ఎస్‌ఆర్‌ఐ బాబా తదితరులున్నారు.

ఆధ్యాత్మికం..

బీరప్పస్వామి వనభోజనాలు



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో గురువారం గొల్ల యాదవ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప స్వామి వన భోజనాలు ఘనంగా నిర్వహించారు. కుల సంఘం మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని గ్రామ శివారులోని బీరప్పస్వామి ఆలయానికి తీసుకెళ్లి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.

సమాచారం..

నేడు బీజేపీ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ వద్ద ధర్నా

బాల్కొండ: బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ గురువారం తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా లీకేజీ నీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌తో పాటు కాళేశ్వరం నీళ్లను ఎస్సారెస్పీలోకి ఎత్తిపోయాలన్నారు. ఆయకట్టు రైతుల ప్రయోజనాల కోసం నీటి విడుదల చేపట్టాలన్నారు. ధర్నాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి

బాల్కొండ/నందిపేట: జూన్ నెల 16 వరకు నూతనంగా పట్టదారు పాస్ పుస్తకం పొందిన రైతులు రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడి, నందిపేట వ్యవసాయ అధికారి భవాని వేర్వేరుగా గురువారం తెలిపారు. రైతు బంధు దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంకు అకౌంట్ పాస్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను అందించాలన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 3.10 ది ఫ్లాష్ – 12.00, 6.55, 10.05
స్క్రీన్-2 –	ఆదిపురుష్ (3డీ–తెలుగు) – 8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-3 –	ఆదిపురుష్ (2డీ–తెలుగు) – 10.30, 2.15, 6.00, 9.45
స్క్రీన్-4 –	ఆదిపురుష్ (2డీ–తెలుగు) – 11.00, 2.45, 6.30, 10.15